## ఉత్సాహంగా జిల్లాస్థాయి క్రికెట్ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్ : జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని క్రీడా మైదానంలో బాలుర అండర్-14 క్రికెట్ ఎంపిక పోటీలు ఉత్సాహంగా జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి యాభై మందికి పైగా విద్యార్థులకు ఈ ఎంపిక పోటీలకు హాజరయ్యారు. ప్రారంభోత్సవానికి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి హాజరై మాట్లాడారు. పోటీల సందర్భంలోనే కాకుండా నిత్య సాధన చేస్తేనే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని సూచించారు. వ్యాయామ విద్య ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోరెడ్డి పార్థసారథి మాట్లాడుతూ జోనల్, రాష్ట్రస్థాయి ఆదిలాబాద్‌లోనే జరుగుతుండటంతో మైదానంలో అత్యుత్తమ ప్రదర్శనతో జట్టుకు ఎంపికవ్వాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులతో పరిచయం చేసుకొని క్రికెట్ ఎంపిక పోటీలు ప్రారంభించారు. ఎంపికైన జిల్లాజట్టును తర్వాత ప్రకటిస్తామని పోటీల నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య నిర్వాహక కార్యదర్శి జక్కుల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ ప్రాంతీయ వార్తలు

## ముగిసిన శ్రావణ శుక్రవారం పూజలు



భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో శ్రావణమాసంలోని ఆఖరివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత నెల 28న మొదటి శుక్రవారం పూజలు జరగ్గా ఈ నెల 4న రెండో శుక్రవారాన్ని పురస్కరించుకొని వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించారు. 11న మూడో శుక్రవారం సందర్భంగా లక్ష్మీ అష్టోత్తర శతనామార్చనలు జరిగాయి. అత్యంత పవిత్రమైన ఈ మాసంలోని నాల్గో శుక్రవారాన్ని పురస్కరించుకొని ఉదయం నుంచి భక్తులు ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి నామాలను స్మరించారు. పంచామృతాభిషేకం చేసి వేద మంత్రోచ్ఛారణలతో సమస్త నదీ తీర్థాలతో, నారీ కేళ జలాలతో, పాలు, పెరుగు, నెయ్యితో అభిషేకం చేశారు. పుష్పాంజలి సేవను భక్తిశ్రద్ధలతో జరిపారు. కుంకుమార్చనలు చేసి భక్తిభావాలను చాటారు. స్వామివారు బంగారు కవచాలంకృతులై దర్శనమివ్వడంతో భక్తులు పులకించిపోయి జై శ్రీరాం అంటూ నీరాజనాలు పలికారు. ఉదయం ప్రధాన కోవెలలో మూల మూర్తులకు సుప్రభాతం పలికి ఆరాధించి పూజలు చేశారు.

వైష్ణవ సంప్రదాయంలో విష్వక్సేన పూజ చేసి పుణ్యాహ వాచనం నిర్వహించి కంకణ ధారణ చేశారు. కన్యాదానం నిర్వహించి ప్రవరను పఠించి సీతమ్మకు యోక్త్ర ధారణ, రామయ్యకు యజ్ఞోపవీత ధారణ నిర్వహించారు. సమస్త మంగళ వాయిద్యాలు మార్మోగుతుండగా ప్రధానార్చకులు జగన్నాథాచార్యులు నేతృత్వంలో నిత్యకల్యాణ ఘట్టం అత్యంత రమణీయంగా జరిగింది. దర్బారు సేవలో సీతారామచంద్రుల వారి వైభవం కళ్లకు కట్టినట్లు కనిపించింది. నేడు బంగారు తులసి పూజలు జరగనున్నాయి.

## సమస్యలు పరిష్కరించాలని ధర్నా

మెదక్ : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల సమాఖ్య అకౌంటెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 12 ఏళ్ల నుంచి మండల సమాఖ్యలను నమ్ముకుని పనిచేస్తున్నా.. తమ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. సెర్ప్ హెచ్‌ఆర్ పాలసీ అమలుచేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.13,500కు పెంచాలన్నారు. మహిళా అకౌంటెంట్లు, ఆపరేటర్లకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సత్యవతి, వెంకటేశ్వర్లు, శ్రీశైలం, పద్మ, ఇందిరమ్మ, వెంకన్న, రాణి, పాలడుగు నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## యార్డును సందర్శించిన యూపీ బృందం

నిజామాబాద్ : నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డును ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అధికారుల బృందం సందర్శించింది. జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానం (ఈ-నామ్) అమలులో జాతీయస్థాయిలో ఉత్తమ అవార్డు దక్కిన నేపథ్యంలో ఇక్కడ క్రయవిక్రయాలు జరుగుతున్న తీరును పరిశీలించారు. రైతులకు ఎలాంటి లాభాలు చేకూరుతున్నాయి? సరకు నాణ్యత విషయంలో ఎలాంటి ప్రమాణాలు పాటిస్తున్నారు? చెల్లింపుల సంగతేంటనే దానిపై క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. కంప్యూటరీకరణ ద్వారా తక్‌పట్టీలు, తూకాల నిర్వహణ ఎలా జరుగుతుందనే దానిపై మార్కెట్ కార్యదర్శి స్వరూపరాణి వివరించారు. బృందంలో లక్నోకు చెందిన రాజ్యకృషి ఉత్పాదన్ మండి పరిషత్ అడిషనల్ డైరెక్టర్ జితేంద్ర ప్రతాప్ సింగ్, కంప్యూటర్ విశ్లేషకులు సత్యేంద్రకుమార్, షాజాపూర్ మార్కెట్ కమిటీ కార్యదర్శి సంజయ్ కుమార్ సింగ్, అలీఘర్ డిప్యూటీ డైరెక్టర్ నరేందర్‌మాలిక్, తదితరులు ఉన్నారు.

## మితిమీరితే కఠిన చర్యలు: సీపీ



నిజామాబాద్ : జిల్లాలోని డీజే సౌండ్ సిస్టం నిర్వాహకులు కమిషనరేట్ నియమ, నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని సీపీ కార్తికేయ సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి మితిమీరి వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కమిషనరేట్‌లోని సమావేశ మందిరంలో డీజే నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. గణేశ్ నవరాత్రుల సందర్భంగా సౌండ్ సిస్టంతో ప్రజలెవరికి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం సాధారణ ధ్వనితోనే డీజేలు నడిపించాలన్నారు. ప్రత్యేకించి గణేశ్ మండపాలు, శోభాయాత్ర సమయంలో ఎక్కువ ధ్వనితో డీజేలు నడిపిస్తే చర్యలు తప్పవన్నారు. అన్ని సమయాల్లోను పరిమిత సాధారణ ధ్వనితోనే డీజేలు నడిచేలా నిర్వాహకులు చూసుకోవాలన్నారు. ఎక్కువ ధ్వనితే నడిస్తే సత్వరమే వాటిని సీజ్ చేసి యజమానిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తే సహించేది లేదన్నారు. ఈ సమావేశంలో నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ ఏసీపీలు ఆనంద్ కుమార్, శివకుమార్, మోహన్, ఎస్‌బీ సీఐ వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

## పక్కా ప్రణాళికలతో అటవీశాఖ లక్ష్యం సాధించాలి

### రాష్ట్ర అటవీశాఖ పీసీసీఎఫ్ పీకే.ఝా

హైదరాబాదు : తెలంగాణకు హరితహారంలో భాగంగా అటవీశాఖకు కేటాయించిన లక్ష్యం పక్కా ప్రణాళికలతో సాధించాలని రాష్ట్ర అటవీ శాఖ పీసీసీఎఫ్ పీకే ఝా జిల్లా అధికారులకు సూచించారు. హైదరాబాదు నుంచి జిల్లా అధికారులతో దూర దృశ్య సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీశాఖకు 2 లక్షల మొక్కలను నాటడమే లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందన్నారు. నిర్దేశించుకున్న లక్ష్యం చిన్నదే అయినా చాలా చక్కగా ముందుకు సాగుతున్నారని జిల్లా అధికారులకు కితాబు ఇచ్చారు. అటవీశాఖ వరకు మంచిగా ఉన్నా.. జిల్లా స్థాయిలో తీసుకుంటే అనుకున్న స్థాయిలో హరితహారంలో మొక్కలు నాటే కార్యక్రమం సాగడం లేదన్నారు. ఈ విధానంలో మార్పు తీసుకురావాలని పాలమూరు పరిధిలోని ఏ రహదారిని చూసినా పచ్చదనం వెల్లివిరియాలన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి సమీపంలోని మయూరీ నర్సరీ వద్ద ఏర్పాటు చేసిన అర్బన్ లంగ్‌స్పేస్‌లో సందర్శకులను మరింతగా ఆకర్షించేందుకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలన్నారు. హరితహారంలో నాటిన ప్రతి మొక్క వివరాలతో పాటు జియో ఇన్‌ఫర్‌మేషన్ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. అటవీ ప్రాంతాల్లో చేపడుతున్న పనులు, వాటి పురోగతిపై సమీక్షిస్తూ అవసరమైన మార్పులు, చేర్పులుంటే వెంటనే నివేదించాలని ఆదేశించారు.

## 40వేల ఎకరాల్లో ఆయిల్‌పాం తోటలు

### ఆయిల్‌ఫెడ్ ఎండీ వీర్రబహ్మాయ్య

అశ్వారావుపేట : తెలంగాణలో మరో 40వేల ఎకరాల్లో ఆయిల్‌పాం తోటల విస్తీర్ణం పెంచడం లక్ష్యంగా సిబ్బందికి దిశా నిర్దేశం చేసినట్లు ఆయిల్‌ఫెడ్ ఎండీ వీర్రబహ్మాయ్య తెలిపారు. అశ్వారావుపేట మండలం మద్దికొండ, అచ్యుతాపురంలో ఆయిల్‌పాం తోటల్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జీవసేంద్రియ ఎరువులతో సేద్యం చేస్తున్న కాసాని వెంకటేశ్వరరావు ఆయిల్‌పాం తోటలను పరిశీలించారు. ఎకరాకు ఎన్ని టన్నుల దిగుబడి అవుతోంది, ఎరువులు వేసే విధానం తదితర అంశాలపై చర్చించారు. రసాయనిక ఎరువులు కాకుండా పశువుల మూత్రంతో తయారు చేసిన జీవ సేంద్రియ ఎరువు వాడకంపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం అశ్వారావుపేట, దమ్మపేట మండలం అప్పారావుపేటలో రెండు పామాయిల్ పరిశ్రమలు అందుబాటులోకి వచ్చాయని గుర్తుచేశారు. ప్రస్తుతం తెలంగాణలో 35 వేల ఎకరాల్లోనే ఆయిల్‌పాం సాగులో ఉందని, మరో 40 వేల ఎకరాల్లో తోటలు పెంచాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. ఏడాదికి పది వేల ఎకరాల చొప్పున ఈ లక్ష్యాన్ని నాలుగేళ్లలో పూర్తి చేయాలని నిర్ణయించినట్లు వివరించారు. ఇటీవల రాష్ట్రం నుంచి కేంద్రానికి ఆయిల్‌పాం టన్ను గెలలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) రూ. 9,500 ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. అది తగ్గితే ఎంఐఎస్ వర్తింపజేయాలని సూచించినట్లు తెలిపారు. రెండు పరిశ్రమల్లో నూనె దిగుబడి శాతం ఆశాజనకంగా ఉందన్నారు. ఆయన వెంట తెలంగాణ ఆయిల్‌ఫెడ్ సీనియర్ మేనేజరు సుధాకరరెడ్డి, ప్రాంతీయ మేనేజరు రాజశేఖరరెడ్డి, అప్పారావుపేట పరిశ్రమ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, ఏరియా మేనేజర్లు పాల్గొన్నారు.

## డీఆర్వోగా ఆర్డీవో వినోద్‌కుమార్‌కు అదనపు బాధ్యతలు

ఇందూరు : జిల్లా రెవెన్యూ అధికారిగా నిజామాబాద్ ఆర్డీవో వినోద్‌కుమార్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఇన్‌ఛార్జి కలెక్టర్ రవీందర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో డీఆర్వోగా పనిచేసిన పద్మాకర్ బదిలీపై వెళ్లారు. దీంతో ఆ తర్వాత ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేశ్‌కు తాత్కాలిక బాధ్యతలు అప్పగించారు. అయితే ఆయనకు రెవెన్యూ శాఖాపరంగా పని ఒత్తిడి పెరగటంతో ఎస్సీ కార్పొరేషన్ బాధ్యతలు చూసుకోవటం వీలు కావట్లేదు. ఈ నేపథ్యంలో ఆయన్ను డీఆర్వో బాధ్యతల నుంచి తప్పించి వినోద్‌కుమార్ తాత్కాలిక బాధ్యతలు అప్పగించారు.

## మద్యం ఆదాయం పూర్తిగా సంక్షేమ పథకాలకే

వైరా : రాష్ట్రంలో బేవరేజెస్ కార్పొరేషన్ ద్వారా వచ్చే(మద్యం అమ్మకాలు) ఆదాయంలో ప్రతిపైసాను సంక్షేమ పథకాలకే వినియోగిస్తున్నట్లు తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ ఛైర్మన్ (టీఎస్‌బీసీఎల్) జి.దేవిశ్రీప్రసాద్‌రావు పేర్కొన్నారు. వైరాలోని మద్యం డిపోలో ఎమ్మెల్యే బాణోత్ మదన్‌లాల్‌తో కలిసి విలేకర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 18డిపోల్లో మద్యం అమ్మకాలు కొనసాగుతున్నాయన్నారు. కొత్తగా సిద్ధిపేటలో డిపో ప్రారంభించామని కొత్తగూడెం, నాగర్‌కర్నూల్, మెయినాబాద్, సూర్యాపేటలో డిపోలు ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేపడుతున్నామన్నారు. కార్పొరేషన్ పరిధిలో అన్ని డిపోలకు సంబంధించి 80 పోస్టులకు కొత్తగా భర్తీ చేయాల్సిందిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామన్నారు. ఈ పోస్టులు త్వరలో భర్తీ కానున్నాయి. మద్యం డిపోల్లో పనిచేసే హమాలీలకు సంక్షేమబోర్డు ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగసంఘం అధ్యక్షుడిగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ఉద్యోగుల బదిలీల సమస్యకు పరిష్కారం అన్వేషిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డీఎం ఆనంద్, సూపర్‌వైజర్ రాధాకృష్ణ, ఏఎస్‌వో డి.శ్యామ్‌కుమార్, వైస్ ఎంపీపీ తన్నీరు జ్యోతి, ఎంపీటీసీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వరరావు, వర్తకసంఘం అధ్యక్షుడు వనమా విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

## కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి పట్టివేత



మధిర : కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో రవాణా చేస్తున్న 30 కిలోల గంజాయిని మధిర రైల్వేస్టేషన్‌లో ఆబ్కారీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను సీఐ నాగేశ్వరరావు విలేకరులకు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా సికులా గ్రామానికి చెందిన డాన్‌బెహ్రా, తుపాన్‌బెహ్రా అనే ఇద్దరు యువకులు 7 ప్యాకెట్లలో 30 కేజీల గంజాయిని టూరిస్ట్ బ్యాగ్‌లో పెట్టుకొని రవాణా చేస్తున్నట్లు తెలిపారు. ఆబ్కారీ శాఖ ఉన్నతాధికారుల ఆదేశం మేరకు కోణార్క్ ఎక్స్‌ప్రెస్ మధిర రైల్వేస్టేషన్‌కు రాగానే సాధారణ బోగీలో అనుమానంతో బ్యాగులు తనిఖీ చేస్తుండగా వీరి వద్ద గంజాయి సంచులు పట్టుబడినట్లు తెలిపారు. ఇద్దరు యువకులు పరారయ్యేందుకు ప్రయత్నించగా వారిని అదుపులోకి తీసుకొని విచారణ అనంతరం మధిర కోర్టులో హాజరుపరిచినట్లు వెల్లడించారు. దాడుల్లో రైల్వే పోలీసులు సహకరించారని సీఐ నాగేశ్వరరావు చెప్పారు. ఈ దాడుల్లో ఆబ్కారీ ఎస్సై ఎం.సౌమ్య, హెడ్‌కానిస్టేబుల్ నాగరాజు, నరసింహ, నజీమా పాల్గొన్నారు.

## సంతోషిమాతకు పుష్పాలంకరణ

నిజామాబాద్ : శ్రావణమాసం చివరివారం జిల్లా కేంద్రంలోని హమాల్‌వాడి సాయిబాబా, సంతోషిమాత ఆలయంలో అమ్మవారికి విశేషంగా పుష్పాలంకరణలతో పూజించారు. పంచామృతాభిషేకాలు, అర్చనలు, సామూహికంగా కుంకుమార్చనలు, మహాహారతులతో కొలిచారు. లలితసహస్ర నామ పారాయణాలు చేశారు. అన్నదానంలో పాల్గొన్నారు. కిషన్‌గంజ్ వాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయంలో వాసవిమాతకు ప్రత్యేకంగా పల్లకీసేవను భక్తిశ్రద్ధలతో జరిపారు.మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి మహిమలను కీర్తిస్తూ భక్తిగీతాలను ఆలపించారు.

## సాంకేతిక పరిజ్ఞానంతో వేగంగా సేవలు



డిచ్‌పల్లి : ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సేవలను పారదర్శకతతో వేగంగా అందించవచ్చని అధికారులకు జిల్లా పాలనాధికారి రవీందర్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ విశ్వవిద్యాలయ కంప్యూటర్ సైన్స్, అండ్ ఇంజినీరింగ్ కళాశాలలో జిల్లా, డివిజన్, మండల, క్షేత్రస్థాయి అధికారులతో సమగ్ర ఆన్‌లైన్ ఆధునిక మాడ్యూల్ అనే అంశంపై మూడు రోజుల శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 15 మాడ్యుల్స్‌లో ఈ శిక్షణ ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నందున అవి లబ్ధిదారులకు చేర వేసేందుకు పారదర్శకంగా ఉండాలన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అధికారులు, సిబ్బంది పని చేయాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలకు వస్తే సమస్యలు పరిష్కారమవుతానే భావన ప్రజల్లో కలిగించాలన్నారు. సమాచార హక్కు చట్టంతో ఆర్జీదారుడు అడిగిన సమాచారం 24 గంటల్లో అందించాలన్నారు. పొరపాట్లు చేయవద్దని, అనుకోకుండా చేసిన వాటిని సరిదిద్దుకోవాలన్నారు. కొత్త సాంకేతికతను ఉపయోగించుకుని ఎప్పటికప్పుడు అప్‌డేట్ కావాలని ఆయన పేర్కొన్నారు. శిక్షణలో డీఈవో రాజేష్, సీపీవో శ్రీరాములుతో పాటు జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## గిరిజన రైతులను మోసగిస్తున్న కేసీఆర్ సర్కారు



ఇంద్రవెల్లి : యూపీఏ హయాంలో అటవీహక్కుల చట్టాన్ని తీసుకొచ్చి గిరిజన రైతులు సాగుచేస్తున్న అటవీ భూములపై వారికి హక్కులను అందజేస్తే కేసీఆర్ సర్కారు మాత్రం వారికీ మాత్రం కనీస హక్కులు లేకుండా అడుగడుగునా మోసం చేస్తోందని కాంగ్రెస్ పార్టీ డీసీసీ కార్యనిర్వాహక జిల్లా అధ్యక్షుడు నరేష్ జాదవ్ ధ్వజమెత్తారు. సమగ్ర భూసర్వేలో చోటుకల్పించి, ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సహాయాన్ని అందజేయాలని డిమాండ్ చేస్తూ గిన్నెర మాజీ సర్పంచి అర్కఖమ్ము నేతృత్వంలో ఇంద్రవెల్లిలో అఖిలపక్షం ఆధ్వర్యంలో రైతులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇక్కడి అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అటవీ హక్కుపత్రాలు ఇచ్చిన గిరిజన రైతులందరికీ ప్రభుత్వం ఇస్తామన్న ఎకరానికి రూ.నాలుగు వేలు ఆర్థిక సహాయాన్ని అందించాలని డిమాండ్ చేశారు. సమగ్ర భూసర్వేలో అటవీహక్కు పత్రాలు కలిగిన రైతుల పేర్లను నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వం స్పందించకపోతే ప్రజాపోరాటంతో తగినబుద్ధి చెబుతామని హెచ్చరించారు. మాజీ సర్పంచి అర్క ఖమ్ము మాట్లాడుతూ అటవీ హక్కుపత్రాలు కలిగిన రైతులకు న్యాయం చేసే వరకు పోరాటాన్ని ఆపేది లేదన్నారు. అందరికీ రుణసౌకర్యాన్ని కల్పించాలని, అటవీ భూములు సాగుచేస్తున్న రైతులకు హక్కుపత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీఓ విద్యాసాగర్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో తెదేపా ఖానాపూర నియోజకవర్గ ఇన్చార్జి రాథోడ్ పరుశురామ్, భాజపా జిల్లా నాయకుడు మరపరాము, కాంగ్రెస్ నాయకులు కనక తుకారామ్, కుమ్ర కోటేష్, రాథోడ్ గణేష్, మెస్రం నాగ్‌నాథ్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

### మంత్రులు పోచారం శ్రీనివాసరెడ్డి, కేటీఆర్

సిరిసిల్ల: సాగునీరు..పంటపెట్టుబడి.. నిరంతర విద్యుత్తు.. ఈ మూడింటిని రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికతో ముందుకు సాగుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. సిరిసిల్ల మండలం సర్దాపూర్‌లో రూ.12.60 కోట్లతో నిర్మించిన వ్యవసాయశాఖ గిడ్డంగులు, ఆచార్య జయశంకర్ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల భవనాల సముదాయాలను మంత్రి కె.తారకరామారావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలో ఏ రాష్ట్రం అమలుచేయని విధంగా ప్రభుత్వం రైతులకు సంక్షేమ పథకాలను అమలుచేస్తూ ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. రాష్ట్రం నుంచి ప్రవహిస్తున్న కృష్ణా, గోదావరి నదుల నీటిని సద్వినియోగం చేసుకొని దశాబ్దాలుగా సాగునీటికి నోచుకోని బీడుభూములను పచ్చని మాగాణులుగా చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. రాష్ట్రంలో కోటి ఎకరాల సాగుభూమి ఉంటే అందులో ప్రాజెక్టుల కింద కేవలం 24లక్షల ఎకరాల ఆయకట్టు మాత్రమే ఉండగా మిగితా వ్యవసాయం బోరుబావులపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. వ్యవసాయాన్ని పండుగలా మార్చేందుకు రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2638 వ్యవసాయశాఖ పోస్టులను రెండు విడతలుగా భర్తీచేసినట్లు తెలిపారు. ఇక్కడి పాలిటెక్నిక్ కళాశాలను గ్రామీణప్రాంతాల్లోని వ్యవసాయ కుటుంబాల విద్యార్థుల సదుపాయం కోసం ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో వ్యవసాయ పరిశోధనలు మరింత విస్తృతం చేసేందుకు అదనంగా వ్యవసాయ కళాశాలను మంజూరు చేయనున్నట్లు ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ప్రతి వ్యవసాయ క్లస్టర్‌కు రూ.15లక్షలతో కార్యాలయాలను నిర్మించనున్నట్లు తెలిపారు. రాబోయే రెండేళ్లలో రైతులు అప్పుల కోసం బ్యాంకులకు వెళ్లే అవసరాన్ని దూరం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. మంత్రి కె.తారకరామారావు మాట్లాడుతూ గతంలో ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూరానికి చెందిన మునిగె ఎల్లయ్య ఎరువుల కోసం వరుసలో నిలబడి అస్వస్థతకు గురై మృతిచెందిన సంఘటన బాధకలిగించిందని అలాంటి పరిస్థితులు ఎదురుకాకూడదనే లక్ష్యంతో రైతు సంక్షేమానికి అధికప్రాధాన్యం ఇస్తున్నామన్నారు.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 2564353, 2569004

# గొర్రెల కాపరుల సహకార సంఘానికి బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు

## జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి విజయ్‌రాజు



వనపర్తి : త్వరలో జరగబోయే గొర్రెల కాపరుల సహకార సంఘానికి బ్యాలెట్ పద్ధతినే ఎన్నికలు నిర్వహిస్తామని జిల్లా పశుసంవర్ధశాఖ అధికారి విజయ్‌రాజ్ అన్నారు. వనపర్తి పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అవగాహన, ఎన్నికలపై చర్చకు హాజరైన జిల్లాలోని గొర్రెల కాపరుల సహకార సంఘాల అధ్యక్షులు కొందరు చేయి ఎత్తి ఎన్నికల్లో పాల్గొనాలని కొందరు, బ్యాలెట్ ద్వారానే ఎన్నికలు జరపాలని మరికొందరు పట్టుబట్టారు. దీంతో సింహభాగం అధ్యక్షులు బ్యాలెట్ పద్ధతిన ఎన్నికలు జరపాలని తెలపడంతో అదే తీర్మానంగా భావించి అధికారి ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మేరకే ఇతర రాష్ట్రాల నుంచి గొర్రెపిల్లలు తీసుకొచ్చి కాపరులకు ఇస్తున్నామని, జిల్లాలో గొర్రెల యూనిట్లు పొందిన వారు వాటిని దుర్వినియోగం చేసుకున్న సందర్భాలుగాని, అనారోగ్యం బారిన పడిన సంఘటనలుగాని లేవన్నారు. అంత పకడ్బందీగాగొర్రెల యూనిట్లను లబ్ధిదారులకు అందిం చామని విజయ్‌రాజ్ అన్నారు. సమావేశంలో తాత్కాలిక సంఘం ప్రతినిధులు కృష్ణయ్య, చంద్రయ్య, దేవేందర్, సుబ్బయ్య, బీచుపల్లి, తిరుపతయ్య, శ్రీనివాసులు, భగవంతు, గోపాల్ పాల్గొన్నారు.

జిల్లా గొర్రెల కాపరుల సహకార సంఘాల అధ్యక్షులతో జరిగిన అవగాహన, ఎన్నికల చర్చా సమావేశంలో ఆద్యంతం నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఎన్నికలు జరుగుతున్నాయని ప్రచారం చేసుకోవడంతో 198 గొర్రెల కాపరుల సహకార సంఘాల అధ్యక్షులు, అనుచరులు హాజరు కానున్నందున పశు సంవర్ధకశాఖ అధికారులు పోలీసుల భద్రతను తీసుకున్నారు. సమావేశానికి వచ్చే సంఘం అధ్యక్షుడు ఫొటో గుర్తింపుకార్డును చూపి సమావేశానికి హాజరు కావాలన్నారు. దీంతో సంఘాల అధ్యక్షులు మినహా మరెవరూ సమావేశంలో పాల్గొనలేదు. గొడవలు లేకుండా సాఫీగా సమావేశం జరిగింది.

జిల్లాలో 198 సంఘాలకు సంబంధించి అధ్యక్షులు సమావేశానికి వస్తుండడంతో ఏ క్షణంలో ఎన్నికలు జరిగినా తమ ప్యానెల్ అభ్యర్థిని గెలిపించుకునేందుకు రెండు వర్గాలు పోటీ పడ్డాయి. తెరాస అనుబంధ ప్యానెల్ అభ్యర్థి, మిగతా ప్రతిపక్ష పార్టీల ప్యానెల్ అభ్యర్థి వర్గం బలప్రదర్శనకు సిద్ధమయ్యారు. సామరస్యపూర్వకంగా ఏకగ్రీవం చేద్దామని పలు దఫాలు పక్కనే ఉన్న సిల్వర్‌జూబ్లీ క్లబ్‌లో చర్చలు జరిపినా ఫలితం లేకపోయింది. దీంతో ఎన్నికలు తప్పవన్న నిర్ణయానికి వచ్చారు. తెదేపాకు చెందిన జడ్పీటీసీసభ్యుడు వెంకటయ్యయాదవ్, తెరాసకు చెందిన వనపర్తి, ఖిల్లాగణపురం ఎంపీపీలు శంకర్‌నాయక్, కృష్ణానాయక్, కౌన్సిలర్లు గట్టుయాదవ్, వాకిటి శ్రీధర్, పి.కృష్ణ, తెరాస నాయకులు పురుషోత్తంరెడ్డి, మాణిక్యం, రాములుయాదవ్ తరలివచ్చారు. వారిని కార్యాలయం వద్దనే పోలీసులు ఆపారు. సమావేశం ప్రశాంతంగా జరగడంతో అంతా వూపిరిపీల్చుకున్నారు.

# ధర్మపురి క్షేత్ర చరిత్ర ఆధారంగా సినిమా

## త్వరలో చిత్రీకరణ: ప్రముఖ దర్శకులు శ్రీనివాస్‌రెడ్డి

ధర్మపురి : ధర్మపురి క్షేత్ర చరిత్ర, ప్రాశస్త్యం ఆధారంగా యమధర్మరాజు నేపథ్యంతో త్వరలో తీయనున్న సినిమాను ఇక్కడే 15 రోజుల పాటు చిత్రీకరిస్తామని ప్రముఖ సినీ దర్శకులు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ధర్మపురి క్షేత్రాన్ని సందర్శించడం ఒక గొప్ప అనుభూతిని కలిగించిదని, ప్రశాంత గోదావరి, యోగ, ఉగ్రస్వాముల దర్శనాలు ఎంతో నచ్చాయన్నారు. వేదాలకు, శాస్త్రాలకు నిలయమైన ధర్మపురి గొప్పతనం అందరికీ తెలిసేలా తనవంతు ప్రయత్నం చేస్తామన్నారు. తనది వ్యవసాయ కుటుంబమైనా బాలచందర్ స్ఫూర్తితోనే సినిమాల్లోకి వచ్చానన్నారు. దర్శకత్వ రంగంలో స్థిరపడాలనుకునే యువత భాషా నైపుణ్యాలను పెంపొందించుకుని ఆసక్తితో రావాలన్నారు. కష్టపడే తత్వం, విశ్లేషణ చేసే గుణాలుంటే ఈ రంగంలో రాణించే అవకాశం ఉందన్నారు. ఢమరుకం సినిమా ఎంతో స్ఫూర్తిమంతమైందని, తాను ఆశించిన దానికంటే ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని, వసూళ్లలోనూ రికార్డు సాధించిందన్నారు. యమధర్మరాజు నేపథ్యంతో తీసే సినిమా చిత్రీకరణను ధర్మపురిలోని యమధర్మరాజు ఆలయంలో నిర్వహిస్తామన్నారు.

సమావేశంలో వర్ధమాన నటులు కిషోర్‌తేజ, రోహన్‌రవీంద్ర, దేవస్థానం అధ్యక్షులు ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ధర్మకర్తలు దోమకొండ తిరుపతి, అక్కనపల్లి సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో దర్శకులు శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రధాన దేవస్థానంతో పాటు అన్ని అనుబంధ ఆలయాల్లో పూజలు చేసిన అనంతరం ఆయనకు ఆశీర్వచన మండపంలో ఆలయ కమిటీ అధ్యక్షులు ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ధర్మకర్తలు స్వామివారి ప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు.

# ఆర్‌ఎంపీ ఇంట్లో పట్టుబడిన మందులు

## డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల ఆకస్మిక తనిఖీ



గోపాల్‌పేట : ఎలాంటి అనుమతుల్లేకుండా ఆర్‌ఎంపీ తన ఇంట్లో ఉంచుకున్న మందులను డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు పట్టుకున్నారు. గోపాల్‌పేటకు చెందిన ఆర్‌ఎంపీ శివకుమార్.. పచ్చకామెర్లకు మందులు ఇస్తుంటాడు. గోపాల్‌పేటకు వచ్చిన గద్వాల, నాగర్‌కర్నూలు డీఐలు బాలకృష్ణ, శ్రీకాంత్ నేరుగా ఠాణాకు వెళ్లారు. అక్కడ ఏఎస్సై ఇలియాస్, కానిస్టేబుల్ రామకృష్ణను వెంటబెట్టుకొని బస్టాండు సమీపంలోని శివకుమార్ ఇంటికి వెళ్లారు. అక్కడ సోదాలు చేసి ఇంట్లో నిల్వ ఉన్న రూ.60వేల విలువైన మందు లను స్వాధీనం చేసుకున్నారు. డీఐలు దాడులు నిర్వహిస్తున్న విషయాన్ని పోలీసులు విలేకరకు తెలిపారు. వెంటనే విలేకర్లు అక్కడి చేరుకున్నారు. అల్లోపతి మందులను అమ్మడానికి ఆర్‌ఎంపీ వైద్యుడికి ఎలాంటి వైద్య విద్యార్హతలు లేవని, మొత్తం 15రకాల మందులను ఆయన ఇంట్లో స్వాధీనం చేసుకున్నామని వనపర్తి ఇన్‌ఛార్జి, గద్వాల్ డ్రగ్ ఇన్‌స్పెక్టరు బాలకృష్ణ విలేకర్లకు తెలిపారు. అమ్మకానికి ఎమ్మార్పీ ముద్రించినవి 6 రకాలు, ఎమ్మార్పీలు ముద్రించనివి 9 రకాల మందులను స్వాధీనం చేసుకొని ఆర్‌ఎంపీ శివకుమార్‌పై కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు సోదాలు చేస్తున్న విషయం తెలియగానే గోపాల్‌పేటలోని అన్ని మందుల దుకాణాలను మూకుమ్మడిగా మూసేశారు.

## రాబోయే అయిదు రోజుల్లో వర్షసూచన

ఆదిలాబాద్ : జిల్లాలో రాబోయే అయిదో రోజుల్లో వర్షసూచనలు ఉన్నట్లు భారతీయ వాతావరణ విభాగం తెలిపిందని వ్యవసాయ పరిశోధః స్థానం శాస్త్రవేత్త శ్రీధర్‌చౌహాన్ తెలిపారు. ఆగస్టు 19న 21 మి.మీ.లు వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. 20న 30 మి.మీ.లు, 21 నుంచి 23వ తేదీ వరకు తేలికపాటి జల్లులు (10 నుంచి 13 మి.మీ.లు) వర్షం కురిసే వీలుందన్నారు. గాలిలో గరిష్ఠ ఉష్ణోగ్రత 30-32 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 22-23 డిగ్రీల సెంటీగ్రేడ్‌గా నమోదు అవుతుందన్నారు. గాలిలో తేమ ఉదయం వేళ 82-87, మధ్యాహ్నం పూట 60-69 శాతం ఉంటుంది. పశ్చిమ వాయువ్య దిశగా గంటకు 5-8 కిమీల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశముందని ఆయన పేర్కొన్నారు.

## బేర్‌ఫూట్ టెక్నీషియన్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

కొత్తగూడెం : జాతీయ ఉపాధి హామీ పథకంలో బేర్‌ఫూట్ టెక్నీషియన్లుగా ఒప్పంద ప్రాతిపదికన పనిచేసేందుకు జిల్లాలోని అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని డీఆర్‌డీఓ పి.జగత్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 2015 నుంచి 2017 నాటికి కనీసం ఒకరోజైనా ఉపాధి పథకంలో పనిచేసిన ఎస్టీ కుటుంబానికి చెందిన వారై ఉండాలని పేర్కొన్నారు. డిప్లొమా సివిల్ ఇంజినీరింగ్ చేసి ప్రకటన జారీచేసిన నాటికి 18 నుంచి 49ఏళ్లలోపు వయస్సు ఉన్నవారు అర్హులని స్పష్టం చేశారు. ఈ నెల 21లోపు కొత్తగూడెంలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో దరఖాస్తు తీసుకొని పూర్తి చేసి అందించాలని తెలియజేశారు. వికలాంగులకు 5 ఏళ్ల వయస్సు సడలింపు ఉంటుందని స్పష్టం చేశారు.

# సమస్యల పరిష్కారం కోసమే రికార్డుల ఆధునికీకరణ

## నల్సార్ రిజిస్ట్రార్ ఆచార్య బాలకృష్ణారెడ్డి



శామీర్‌పేట : ప్రజల భాగస్వామ్యంతో భూసమస్యలు లేని గ్రామాలుగా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దేందుకే భూరికార్డుల ఆధునికీకరణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య బాలకృష్ణారెడ్డి తెలిపారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా శామీర్‌పేట మండల పరిధిలోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంలో సిద్దిపేట జిల్లాలో చేపట్టే పైలెట్ ప్రాజెక్టుపై రెవెన్యూ యంత్రాంగం, యువత, గ్రామస్థులను ఎంపిక చేశారు. వీరికి రెండు రోజులపాటు జరిగే ప్రజల భాగస్వామ్యంతో భూరికార్డుల ఆధునికీకరణపై ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అందులో ఆయన మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలోని మూడు గ్రామాలను ఎంపిక చేసుకొని రెండు మాసాల్లో జిల్లా రెవెన్యూ యంత్రాంగం సహకారంతో భూసమస్యలు లేని పల్లెలుగా తీర్చిదిద్దుతామన్నారు. ఎంపిక చేసుకున్న గ్రామాల నుంచి ముగ్గురు యువతీ, యువకుల చొప్పున ఎంపిక చేసుకొని ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. లాండెస్సా తెలుగు రాష్ట్రాల సంయుక్త డైరెక్టర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ గతంలో గ్రామ వ్యవస్థలో జమాబందీ నిర్వహించి రెవెన్యూ అధికారులు రికార్డులు ఆధునికీకరించే వారన్నారు. ఆ విధానంతో భూరికార్డులు పక్కాగా ఉండేవని పేర్కొన్నారు. ఆ తరహాలోనే సిద్దిపేట జిల్లాలోని మూడు గ్రామాల్లో సర్వే నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో న్యాయవాదులు జీవన్‌రెడ్డి, అభిలాష్‌రెడ్డి, మల్లేశ్, సందీప్, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

# జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన

హన్మకొండచౌరస్తా : రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మౌలిక వసతుల కల్పనకు, అదనపు గదులు, భవనాల నిర్మాణానికి రూ.325 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి తెలిపారు. శుక్రవారం హన్మకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో రూ.7.25 కోట్లతో నిర్మాణం చేపట్టనున్న నూతన భవనానికి ఉప ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు.

అనంతరం స్థానిక ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దాదాపు 60 ఏళ్ల క్రితం కట్టిన ఈ కళాశాలలో మాజీ ప్రధాని పీవీ నరసింహరావు చదువుకున్నారన్నారు.

ఇదే కళాశాలలో 1980-84 మధ్యకాలంలో తాను రసాయనశాస్త్ర అధ్యాపకుడిగా పని చేశానన్నారు. అలాంటి చరిత్ర కలిగిన ఈ భవనం స్థానంలోనే 20 తరగతి గదులు, 5 ప్రయోగశాలలు, ఉపాధ్యాయుల గదులు, ప్రిన్సిపల్ గది, విద్యార్థులకు ప్రత్యేక గదులు ఉండేలా రాష్ట్రంలోనే ఆదర్శ వంతమైన భవనాన్ని 12 నెలల కాలంలో నిర్మించనున్నామని తెలిపారు. అనుకున్న సమయంలో భవనాన్ని పూర్తి చేయాలని సంబంధిత ఇంజినీర్లను ఆదేశించారు. పనులపై తరచుగా సమీక్ష చేయాలని కళాశాల ప్రిన్సిపల్‌ను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నత విద్యను ఉచితంగా అందించడమే కాకుండా 404 జూనియర్ కళాశాలల్లో భవనాలు, మౌలిక సదుపాయాల కల్పనతో ప్రవేశాలు 30 శాతం పెరిగాయన్నారు.

ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. చదువును ఇష్టంతో చదివితే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. మంచి ఉపాధ్యాయులు ఉన్న ఈ కళాశాలకు త్వరలో నూతన భవనం రావడం సంతోషకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటు సభ్యులు పసునూరి దయాకర్, వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టర్ ఆమ్రపాలి, ఆర్‌జేడి సుహాసిని, కళాశాల ప్రిన్సిపల్ నాగచందర్‌రావు, డీఐఈవో ఆజాద్, డిప్యూటీ మేయర్ సిరాజుద్దిన్, రాష్ట్ర వికలాంగుల సంస్థ ఛైర్మన్ వాసుదేవరెడ్డి, కార్పొరేటర్లు వేముల శ్రీనివాస్, వీరగంటి రవీందర్, దేవేందర్ కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## హరితహారానికి ఎన్టీపీసీ చేయూత

పెద్దపల్లి: హరతహారం పథకం మొక్కల పెంపకానికి ఎన్టీపీసీ చేయూతనిచ్చింది. పచ్చదనం పరుకునేందుకు ముందుకు వచ్చి ఆర్థికసాయం అందించింది. జిల్లాలో హరితహారం పథకంలో ఎన్టీపీసీ, సింగరేణి, కేశోరాం సంస్థలను భాగస్వాములను చేయాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. వీటిలో ఒక్కో సంస్థకు మొక్కల పెంపకం లక్ష్యాలను నిర్దేశించింది. సింగరేణి యాజమాన్యం మొక్కలను పంపిణీ చేస్తోంది. ఎన్టీపీసీ అధికారులు మొక్కల కొనుగోలుకు ముందుకు వచ్చి రూ.77.05 లక్షల చెక్కును అందజేశారు.

## విజిలెన్స్ అధికారుల తనిఖీలు

నారాయణపేట : నారాయణపేట, మక్తల్ మైనార్టీ గురుకులాల్లో విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మైనార్టీ గురుకులంలో విజిలెన్స్ అధికారులు ఖుద్దూస్, గులాం హుసేన్, నారాయణ పాఠశాలలు కొనసాగుతున్న తీరును పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. మక్తల్‌లో మైనార్టీ బాలికల గురుకులం, నారాయణపేట బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం, వసతి, బోధన పలు అంశాలపై పరిశీలించారు. పేటలో గురుకుల పాఠశాల భవనం విద్యార్థులకు సరిపడ లేదన్నారు. అలాగే నాణ్యమైన భోజనాన్ని అందించాలని పాఠశాల సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు. అంతకు ముందు విజిలెన్స్ అధికారులు విద్యార్థులతో నేరుగా మాట్లాడి పాఠశాలలో ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు పట్టిక, దస్త్రాలను పరిశీలించారు. తనిఖీ సమయంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ బాల నర్సింహస్వామి, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఫలించిన ఒప్పంద కార్మికుల పోరాటం

## కేంద్ర ప్రభుత్వం జీవో ప్రకారం వేతనాల అమలుపై ఉత్తర్వులు

కొత్తగూడెం : ఎట్టకేలకు ఒప్పంద కార్మికుల పోరాటం ఫలించింది. జనవరి నుంచి పెరిగిన వేతనాలు అమలు చేయాలని చేపట్టిన ఆందోళనలకు యాజమాన్యం స్పందించింది. కేంద్ర ప్రభుత్వం కొత్తగా జారీ చేసిన జీవో ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని అఖిలపక్షం చేపట్టిన పోరాటానికి సింగరేణి దిగివచ్చింది. ఇతర ప్రభుత్వ రంగ పరిశ్రమల్లో కేంద్ర ప్రభుత్వ జీవో ప్రకారం వేతనాలు చెల్లిస్తున్నా ఇక్కడ అమలు చేయడం లేదని ఒప్పంద కార్మిక సంఘాలన్నీ ఐక్యంగా ఉద్యమించాయి. ఇటీవల కేంద్ర కార్మిక శాఖ ఉప కమిషనర్ సమక్షంలో కూడా ఆందోళన చేపట్టడంతో యాజమాన్యంపై ఒత్తిడి పెరిగింది. దీంతో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం ఒప్పంద కార్మికులకు వేతనాలు చెల్లించేందుకు సింగరేణి యాజమాన్యం ఆదేశాలు జారీ చేసింది. దీంతో వచ్చే నెల నుంచి కొత్త వేతనాలు అమలులోకి రానున్నాయి. ఇప్పటివరకు గడిచిన ఏడు నెలలకు సంబంధించిన బకాయిలు చెల్లించనున్నారు.

సింగరేణిలో ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం వేతనాలు చెల్లిస్తున్నారు. ఒప్పంద కార్మికులకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా తయారు చేసిన జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలని జనవరిలో ఉత్తర్వులు విడుదల చేశారు. జనవరి నుంచి అమలు కావాల్సిన కనీస వేతనాలు సింగరేణిలో అమలు చేయడం లేదు. దీంతో మార్చి 15 నుంచి తొమ్మిది రోజుల పాటు సమ్మె చేపట్టారు. ఈనెల 14న సింగరేణి ఎన్నికలపై హైదరాబాద్ ఆర్‌ఎల్‌సీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశాన్ని అడ్డుకోవడంతో పాటు కనీస వేతన కమిటీ ఛైర్మన్ ఆవుల గోవర్దన్ కార్మిక శాఖ ఉప కమిషనర్‌తో చర్చించిన నేపథ్యంలో యాజమాన్యంపై ఒత్తిడి తీసుకొచ్చారు. స్పందించిన యాజమాన్యం కేంద్ర జీవో ప్రకారం వేతనాలు చెల్లించేందుకు ఆదేశాలు జారీ చేసింది.

యాజమాన్యం జారీ చేసిన ఆదేశాలతో 12 వేల మంది ఒప్పంద కార్మికులకు ప్రయోజనం చేకూరనుంది. సింగరేణిలో పారిశుద్ధ్యం, ఉద్యానవన విభాగం, ఉపరితల విభాగాల్లో పని చేస్తున్న ఒప్పంద కార్మికులకు కనీస వేతనం రోజుకు రూ.359 చెల్లించాలని జీవో విడుదల చేసింది. జనవరిలో రూ.350 ఉన్న కనీసవ వేతనం ఏప్రిల్‌లో పెరిగిన డీఏ ప్రకారం రూ.359కి పెరిగింది. ఇప్పటి వరకు సింగరేణిలో రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం రోజుకు రూ.311 మాత్రమే చెల్లిస్తోంది. కేంద్ర ప్రభుత్వ జీవో ప్రకారం వేతనాలు చెల్లించడం ద్వారా రోజుకు రూ.48 పెరగనుంది. దీంతో నెలకు సుమారుగా రూ 1000 అదనంగా ప్రయోజనం చేకూరనుంది. సింగరేణిలో పని చేసే ఉపరితల విభాగాల ఒప్పంద కార్మికులకు నెలకు సుమారు రూ.10 వేల వరకు వేతనాలు పొందే అవకాశం ఏర్పడింది. సింగరేణి వ్యాప్తంగా ఉపరితల విభాగాల్లో 12 వేల మంది ఒప్పంద కార్మికులు పని చేస్తున్నారు. కొత్తగా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలని ఆందోళన చేపట్టడంతో యాజమాన్యం స్పందించింది.

సింగరేణిలో పనిచేస్తున్న ఒప్పంద కార్మికులకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఒప్పంద కార్మికులు తొమ్మిది రోజుల పాటు సమ్మె చేపట్టారు. పారిశుద్ధ్యంతో పాటు ఇతర విభాగాల్లో పనులు బహిష్కరించారు. మార్చి 15 నుంచి 23 వరకు సమ్మె చేపట్టడంతో యాజమాన్యం చర్చలకు ఆహ్వానించింది. అయితే త్వరలోనే అమలు చేస్తామని చెప్పిన యాజమాన్యం మళ్లీ వాయిదా వేసింది. తాజాగా ఈనెల 14న హైదరాబాద్ ఆర్‌ఎల్‌సీ కార్యాలయంలో సింగరేణి ఎన్నికలపై నిర్వహించిన సమావేశంలో ఒప్పంద కార్మికుల ప్రస్తావన తీసుకువచ్చారు. ఐదు జాతీయ కార్మిక సంఘాలతో పాటు ఇతర కార్మిక సంఘాలన్ని ఒప్పంద కార్మికులకు కనీస వేతనాల జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అక్కడే ఉన్న సింగరేణి యాజమాన్యం ప్రతినిధులతో కార్మిక శాఖ అధికారులు చర్చించారు. దీంతో దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని వెల్లడించడతో ఆందోళన విరమించారు. ఇటు కార్మిక శాఖ, అటు కార్మిక సంఘాల నుంచి ఒత్తిడి రావడంతో యాజమాన్యం జీవో ప్రకారం వేతనాలు చెల్లించేందుకు ఆదేశాలు జారీ చేసింది.

## మొక్కలు నాటిన సీఐడీ అధికారులు



కరీంనగర్ : హరితహారం కార్యక్రమంలో భాగంగా సీఐడీ అదనపు డీజీ గోవింద్‌సింగ్ ఉత్తర్వుల మేరకు కరీంనగర్‌లోని రీజినల్ సీఐడీ కార్యాలయం అధికారులు, సిబ్బంది మొక్కలు నాటారు. సీఐడీ డీఎస్పీ కృష్ణ ఆధ్వర్యంలో బైపాస్‌రోడ్డులోని ఫిల్టర్ బెడ్ వద్ద సీఐడీ కార్యాలయానికి కేటాయించిన స్థలంలో, విద్యారణ్యపురిలో ఉన్న సీఐడీ కార్యాలయం సమీపంలో 300 మొక్కలు నాటారు. ఇన్స్‌పెక్టర్లు ఈ.ప్రభాకర్, జి.నరేందర్, జి.కోటేశ్వర్, ఎ.ప్రభాకర్, ఎస్.ఉపేందర్, కె.సృజన్‌రెడ్డి, టి.మోసిల్, ఎన్ఎస్ మోహషన్‌రాజ, డి.రాజనర్సయ్య, ఎస్సైలు జి.చంద్రశేఖర్, సి.నారాయణ, ఎస్.కె రియాజ్ పాష, ఈ.నాగార్జునరావు, టి.కరుణాకర్, వి.నరేష్‌కుమార్, జి.రవీందర్, ఎన్.కిరణ్‌రెడ్డి, వి.శ్రీనివాస్, పి.కుమారస్వామి, ఎం.డి అక్రమ్‌పాశ, దుర్గ, ఎం.డి శంషొద్దీన్, జి.గంగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

